సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం ; 30 ; జూలై ; 2025



కొబ్బరి ధరహాసం

రికార్డు స్థాయిలో కొబ్బరి ధరతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పచ్చి కొబ్బరి, కురిడి, కొత్త కొబ్బరి కాయ దొరకడం గగనంగా మారింది. 8లో ▸



ఫసల్ బీమా.. రైతులకు ధీమా

ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంటకు నష్టం వాటిల్లితే బీమా వర్తించేలా ఈ పథకాన్ని రూపొందించారు. 8లో ▸



చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

ఏలూరులో రాత్రివేళ ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న కేసులో ఇద్దరు నిందితులను, బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఆత్మీయ కలయిక



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మురళీకృష్ణంరాజు

భీమవరం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త ముదునూరి మురళీకృష్ణంరాజు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో నిర్వహించిన పార్టీ పీఏసీ సమావేశానికి హాజరైన సందర్భంగా ఆయన పార్టీ అధినేతను కలిశారు.

పీ4లో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పీ4లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లాలోని సంపన్న రైతులు, ఎరువులు, పురుగు మందుల షాపుల యజమానులు, డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని పేద వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని, కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారికి చేయూతనిస్తే వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు.

దోపిడీ కోసమే స్మార్ట్ మీటర్లు



ఏలూరు బిర్లా భవన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

ఏలూరు (టూటౌన్): దోపిడీ కోసమే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ నాయకులు విమర్శించారు. కార్మిక సంఘాల ఐక్యకార్యాచరణ ఆధ్వర్యంలో మంగళవారం వన్ టౌన్ బిర్లాభవన్ సెంటర్ నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సీఐటీయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాదు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగ ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి అదానీ కంపెనీకి సేవకులుగా పని చేస్తున్నారని విమర్శించారు. ప్రజల డబ్బులను ఏ విధంగా దోచుకోవాలో, ఆ డబ్బులు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేలా బాబు సర్కార్ వేగంగా పనిచేస్తుందని ఎద్దేవా చేశారు.

పోలవరం నుంచి భారీగా నీటి విడుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పోలవరానికి వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. తెలంగాణ, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలకు గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహించడంతో గోదావరిలో వరద పోటెత్తుతోంది. గత నాలుగు రోజుల నుంచి రోజుకు సగటున 5 లక్షల క్యూసెక్కుల నీరు పోలవరం నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే నీటిమట్టం 31.050 మీటర్లుండగా దిగువకు 6,70,335 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

స్వర్ణకార సంఘ కార్యవర్గం ఎన్నిక



పట్నాల శేషగిరిరావు

ఆకివీడు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్వర్ణకార సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ చైర్మన్ పట్నాల శేషగిరిరావు మంగళవారం చెప్పారు. ఆరోసారి తమను ఎన్నుకోవడంతో డబుల్ హ్యాట్రిక్ సాధించామన్నారు. 25 ఏళ్లపాటు ఒక సంఘం ఏకగ్రీవంగా ఎన్నికవడం ఇదే ప్రథమమన్నారు. స్వర్ణకారులకు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులకు సంఘం తరుపున చేసిన సేవల్ని గుర్తించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. అధ్యక్షుడిగా తనతో పాటు ప్రధాన కార్యదర్శిగా నల్లగొండ వెంకట రామకృష్ణ, కోశాధికారిగా కొమ్మోజు రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు కొనసాగుతారని చెప్పారు.

ఉచితం పరిమితం

- రాష్ట్రమంతా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యమంటూ హామీ
- ఇప్పుడు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగులకే పరిమితం?
- జిల్లాలో 9.23 లక్షల మహిళలకు ఉన్న బస్సులు కేవలం 184
- ఆర్టీసీ బస్సులు వెళ్లని గ్రామాలు 100 పైనే



సాక్షి, భీమవరం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర మంతా ఉచితం ప్రయాణమని ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ప్లేటు ఫిరాయించింది. ఉచిత బస్సు హామీకి ఏడాది ఎగనామం పెట్టిన చంద్రబాబు సర్కారు రానున్న ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామంటోంది. ఉచిత ప్రయాణం జిల్లా వరకే పరిమితమంటూ చేతులెత్తేసింది. కూటమి సూపర్‌సిక్స్ హామీల్లో మహిళలకు ఉచిత బస్సు సదుపాయం ఒకటి. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం తదితర సభల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర మంతటికీ వర్తింపచేస్తామంటూ హామీ ఇచ్చిన విషయం విదితమే. రానున్న ఆగస్టు 15 నుంచి ఈ హామీని అమల్లోకి తేనున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఉన్నతస్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోనే ఉచిత బస్సు సర్వీసులు నడిపే దిశగా ఆర్టీసీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఆంక్షల నడుమ పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు సర్వీసుల్లో మాత్రమే మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతించనున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని మొత్తం బస్సులు రోజుకు లక్ష కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తుండగా, 90 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో జిల్లా పరిధిలో ప్రయాణిస్తున్న వారు దాదాపు 70 శాతం మంది ఉంటారు. మహిళలకు ఉచిత బస్సు నేపథ్యంలో ఈ ఆక్యుపెన్సీ మరో 15 నుంచి 20 శాతం పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులతో రద్దీ అధికంగా ఉంటుంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఈ రద్దీ మరింత పెరగనుంది. అలాగే పట్టణ ప్రాంతాల్లో లోకల్ సర్వీస్ పెరుగుతుంది. ప్రస్తుతం ఉన్న 23 స్పేర్ బస్సులు, 22 బడి బస్సుల్లో దాదాపు 30 బస్సులను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా రద్దీని అధిగమించే యోచనలో ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

జిల్లాలో బస్సులు ఇలా..

జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం డిపోల పరిధిలో మొత్తం 295 బస్సులు ఉన్నాయి. వీటిలో దూరప్రాంతాలకు వెళ్లే వెన్నెల, స్టార్ లైనర్లు నాలుగు, ఇంద్ర బస్సులు 11, సూపర్ లగ్జరీ బస్సులు 33, అల్ట్రా డీలక్స్‌లు 26, ఎక్స్‌ప్రెస్‌లు 20 వరకు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల మధ్య సేవలందిస్తున్న అల్ట్రా పల్లె వెలుగులు 19, పల్లె వెలుగు బస్సులు 158 ఉండగా, స్పేర్ బస్సులు 23 ఉన్నాయి. జిల్లాలోని మొత్తం బస్సుల్లో వెన్నెల సర్వీస్‌తో పాటు ఒక అల్ట్రా డీలక్స్, తొమ్మిది ఎక్స్‌ప్రెస్ బస్సులు, 17 అల్ట్రా పల్లె వెలుగు, 47 పల్లె వెలుగు బస్సులను అద్దె ప్రాతిపదికన నడుపుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో మహిళల జనాభా 9.23 లక్షలు. ప్రస్తుతం వీరి సంఖ్య మరింత పెరిగింది. జిల్లాలో 409 పంచాయతీలకు దాదాపు 300 గ్రామాలకు మాత్రమే ఆర్టీసీ బస్సు సదుపాయం ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రయాణించాలంటే ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ సర్వీసులు ఎక్కువగా ఉంటాయి. వీటికి అనుమతి ఇవ్వకుండా కేవలం పల్లె వెలుగు బస్సులకు మాత్రమే అనుమతించడం సరికాదని మహిళలు మండిపడుతున్నారు. అదనపు బస్సులు లేకుండా ఉన్న వాటినే సర్దుబాటు చేయడం తూతూమంత్రంగా ఎన్నికల హామీని అమలుచేయడమేనని విమర్శిస్తున్నారు.

సిద్ధంగా ఉన్నాం



మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రానప్పటికి సిద్ధంగా ఉన్నాం. బస్సులను పూర్తి కండీషన్‌లోకి తెచ్చాం. ప్రస్తుతం స్పేర్‌లో ఉన్న వాటిని, బడి బస్సులను వినియోగంలోకి తీసుకువచ్చి అవసరాన్ని బట్టి అదనపు బస్సుల కోసం ప్రతిపాదనలు పంపాలని భావిస్తున్నాం. సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– ఎస్‌వీఆర్ వరప్రసాద్, జిల్లా ప్రజా రవాణ అధికారి, భీమవరం

కండిషన్ అంతంత మాత్రమే

పల్లె వెలుగు హైర్ సర్వీసులతో పోలిస్తే మిగిలిన వాటి కండిషన్ అంతంత మాత్రంగానే ఉన్నాయి. వాటిలో ప్రయాణిస్తున్నప్పుడు కుదుపులు, కిటికీల తలుపుల నుంచి వచ్చే శబ్దాలకు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తుందని ప్రయాణికులు అంటున్నారు. సిబ్బంది కొరత అధికంగా ఉంది. అవుట్ సోర్సింగ్ ద్వారా డ్రైవర్లను భర్తీచేసే యోచనలో అధికారులు ఉన్నారు. పనిభారం పెరిగినప్పుడు కండక్టర్లను డబుల్ డ్యూటీ చేయించాలని భావిస్తున్నారు.

ఈ రూట్లలో మాటేంటి ?

ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయడం ద్వారా జిల్లాలోని ఆర్టీసీ రోజుకు రూ.40 లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. భీమవరం–రాజమహేంద్రవరం, భీమవరం–తాడేపల్లిగూడెం, భీమవరం– తణుకు, భీమవరం–నరసాపురం, భీమవరం–ఏలూరు రూట్లు ఆర్టీసీకి ఆదాయాన్ని తెస్తున్నాయి. భీమవరం డిపోలోని గణపవరం రూట్, నరసాపురంలోని దొడ్డిపట్ల, కందరపల్లి, చినగొల్లపాలెం రూటు, తణుకులోని వరిగేడు, పసలపూడి రూటు, తాడేపల్లిగూడెంలోని అప్పారావుపేట, సింగరాజుపాలెం, పోల వరం రూట్లు ఆదాయం లేని రూట్లుగా ఉండటంతో వీటికి సర్వీసులు అంతంతమాత్రంగానే నడుస్తున్నాయి. ఆదాయం లేని రూట్లలో మహిళల ఉచిత ప్రయాణానికి అదనపు బస్సులు ఏర్పాటు చేస్తారో లేదో వేచిచూడాలి.

ఐకమత్యంతో సాగాలి



ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్ లోగో ఆవిష్కరిస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని తద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి తానేటి వనిత సూచించారు. మంగళవారం స్థానిక డీసీఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ ప్రారంభోత్సవ సమావేశం జాతీయ అధ్యక్షుడు రెబ్బ ఇమ్మానుయేల్, జాతీయ కార్యదర్శి జీవన్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న తానేటి వనిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేవుడి మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రేమ, క్షమించడం, ఆదరణ లక్ష్యాలుగా జీవిస్తేనే మోక్షమార్గం లభిస్తుందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ ఐకమత్యంతో ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తి స్థాయిలో పేద బడుగు బలహీన వర్గాలకు అందేలా స్వచ్ఛంద సంస్థల నాయకులు కృషి చేయాలన్నారు. ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక అభివృద్ధి ఐక్యత, సేవ, ప్రేమ గుణాలతో ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి పాస్టర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని 28 రాష్ట్రాల పరిధిలో పాస్టర్లు అంతా కలిసి ఆలిండియా పాస్టర్స్ ఫెడరేషన్‌గా ఏర్పడినట్లు తెలిపారు. జాతీయ అధ్యక్షుడు బిషప్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ క్రైస్తవులపై దాడుల నివారణ, పేదలకు సేవ లక్ష్యంగా ఫెడరేషన్ ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు జాతీయ జెండాలు ప్రదర్శించారు.

కౌలు రైతులందరికీ రుణాలివ్వాలి



అక్షర ఆంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందిచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్‌హెచ్‌జీలకు రుణాల మంజూరు లక్ష్యంలో చాలా లోటు కనిపిస్తుందని, మైక్రో క్రెడిట్ ప్లాన్ అందిన వెంటనే రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.977.74 కోట్ల రుణాల మంజూరు లక్ష్యంగా కాగా.. కేవలం రూ.144.85 కోట్లు మాత్రమే మంజూరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఏ ద్వారా పంపిన 9,633 ఎంఎస్‌ఈలకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. చేనేత కార్మికులకు ముద్ర లోన్ మంజూరులో తీవ్ర జాప్యం ఎందుకని ప్రశ్నించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎల్.వి.వి.ఆర్.కె.ఎం.ఎస్ మన్యం మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం అమలు లక్ష్యానికి కృషి చేయాలని సూచించారు. నాబార్డ్ ప్రతినిధి నిష్యంత్ చంద్ర, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, ఆర్బీఐ ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

భీమవరం అర్బన్: సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు అక్షర జ్ఞానం కలిగి ఉండాలని, జిల్లాలోని నిరక్షరాస్యలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి 'అక్షర ఆంధ్ర' అక్షరాస్యత 2025–26పై శిక్షణా తరగతుల ప్రారంభ సభలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 2029 నాటికి నిరక్షరాస్యులు లేని జిల్లాగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంచేందుకు అధికారులు నిరంతరాయంగా కృషి చేయాలన్నారు.

న్యాయం చేయకపోతే పోరు ఉధృతం

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల తీర్మానం



గుర్వాయిగూడెంలో ధర్నా నిర్వహిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు

జంగారెడ్డిగూడెం: గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, ఆగస్టు 4న గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని మానవతా కల్యాణ మండపంలో నిర్వాసిత రైతుల సదస్సు నిర్వహించారు. సదస్సుకు వామిశెట్టి హరిబాబు అధ్యక్షత వహించారు. రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఆగస్టు చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు వినతి పత్రాలు అందజేయాలని సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానించారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్వాసిత రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదని, రైతులను మోసగించారని తీవ్రంగా విమర్శించారు. సర్వీస్ రోడ్ల నిర్మాణం చేయకపోవడం వల్ల పొలాలకు వెళ్లే మార్గాలు లేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్బిట్రేషన్ పిటిషన్ల ద్వారా పరిహారం పెంచి ఇస్తామని హామీ ఇచ్చి కొద్దిమందికి కొద్ది పరిహారం పెంచి మిగిలిన రైతులకు అన్యాయం చేయడం తగదన్నారు. చింతలపూడి, టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి తదితర మండలాల్లో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల తలెత్తిని సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. సదస్సులో రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, అల్లూరి రామకృష్ణ, దేవరపల్లి సత్యనారాయణ, శీలం రామచంద్రరావు, ఎలికే తాతారావు, వందనపు సాయిబాబా, కె.నాగేశ్వరావు, కె.రంగారావు, జి.నర్సిరెడ్డి, బొడ్డు రాంబాబు, పి.శ్రీహరి తదితరులు మాట్లాడుతూ సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల గ్రామాల రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సదస్సుకు ముందుగా గురవాయిగూడెంలో రైతులు ధర్నా చేపట్టారు.

భూ కేటాయింపులు రద్దు చేయాలి

నూజివీడు: మంత్రి కొలుసు పార్థసారథి కుటుంబ సభ్యులకు చెందిన నితిన్ కృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో 45.60 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరం కేవలం రూ.ఐదు లక్షలకే విక్రయించటం దుర్మార్గమన్నారు. వాస్తవానికి ఆగిరిపల్లి ప్రాంతంలో ఎకరం భూమి రూ.50 లక్షలపైగా ఉందని, భూపందేరం వెనుక ఏదో మతలబు ఉన్నట్టు అనిపిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని, హామీల అమలును విస్మరించి ప్రభుత్వ భూములు, ప్రకృతి సంపదలను కార్పొరేట్ కంపెనీలకు, కేబినెట్ పెద్దలకు అప్పగిస్తూ పాలన చేయటం సబబుకాదన్నారు.

భవన నిర్మాణ కార్మికుల పోరుబాట

- వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని ఆందోళనలు
- ప్రభుత్వం స్పందించకుంటే ఉధృతం చేస్తామని హెచ్చరిక



వీరవాసరం తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

భీమవరం: పనులు లేక అవస్థలు పడుతున్న భవన నిర్మాణ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలంటూ పోరుబాట పట్టారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా కార్మికులకు చేతినిండా పనులు దొరకని దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే కార్మిక, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నాయి. వీరికి తోడు భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఉద్యమబాట పట్టారు. దీనిలో భాగంగా ఇప్పటికే భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి వినతిపత్రాలు అందచేశారు.

నమోదు సులభతరం చేయాలి

భవన నిర్మాణ కార్మికులకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి బోర్డులో కార్మికుల నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు ద్వారా నిర్మాణదారుల నుంచి ఒక శాతం సెస్ వసూలు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించగా నేటి ప్రభుత్వం సెస్ నిధులను దారి మళ్లించి కార్మికులకు మొండిచేయి చూపుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులుండగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గతంలో సుమారు 1.70 లక్షల మంది కార్మికులు వెల్ఫేర్ బోర్డులో నమోదు చేసుకున్నారు.

హామీని ఎప్పుడు అమలు చేస్తారు?

ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కార్మికుల నమోదు వంటి ప్రక్రియను సులభతరం చేసి వార్డు, గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఐదురోజులు ఆసుపత్రిలో ఉండాలనే నిబంధనను, తొలగించాలని ప్రమాదం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్న కార్మికులకు ఇచ్చే రూ.100 భృతిని రూ.500 పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు, ఆనారోగ్యం కారణంగా మంచాన పడిన కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా ఈఎస్‌ఐ తరహాలో ఉచిత వైద్య సాయం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పోరుబాట తప్పదని హెచ్చరిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అందించాల్సిన సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయి. గతంలో ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేసిన సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బండి శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు, వీరవాసరం

పోరుబాట తప్పదు



భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డును పునరుద్దరించకుంటే పోరుబాట తప్పదు. చేతినిండా పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా కరువైతే పరిస్థితి మరింత దుర్భరంగా మారుతుంది.

– మండ సూరిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి

ఆందోళనలు ఉధృతం చేస్తాం




వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తాం. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేసి అధికారులకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందచేశాం.

– నారపల్లి రమణరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన కారు

విశ్రాంత సైంటిస్ట్ మృతి



వెంకటేశ్వరరావు మృతదేహం

ముదినేపల్లి రూరల్: పోల్‌రాజ్ డ్రెయిన్‌లో కారు దూసుకుపోయిన ఘటనలో విశ్రాంత సైంటిస్టు మరణించిన ఘటన ముదినేపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. మండవల్లి మండలం లింగాలకు చెందిన చందు వెంకటేశ్వరరావు(63) నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ(ఎన్‌ఆర్‌ఎస్‌ఏ)లో శాస్త్రవేత్తగా పనిచేస్తూ ఇటీవలే ఉద్యోగ విరమణ చేసి హైదరాబాదులో ఉంటున్నారు. లింగాల గ్రామంలోని బంధువుల ఇంట జరిగే వివాహం నిమిత్తం హైదరాబాదు నుంచి భార్య రాణితో కలసి వస్తున్నారు. పోల్‌రాజ్ వంతెన వద్ద డైవర్షన్ రోడ్డులో ప్రయాణించాల్సి ఉండగా, డైవర్షన్ గమనించకపోవడంతో పోల్‌రాజ్ డ్రెయిన్‌లోకి కారు దూసుకుపోయింది. ప్రమాద సమయంలో పక్కనే చెరువులపై పనిచేసే కూలీలు ప్రమాదాన్ని గమనించి కాల్వలోకి దూకి రాణిని కాపాడారు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతిచెందారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే కైకలూరు సీఐ వి.రవికుమార్, స్థానిక ఎస్‌ఐ వీరభద్రరావు సంఘటన స్థలానికి చేరుకుని వెంకటేశ్వరరావు మృతదేహాన్ని బయటకు తీసి, గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాంట్రాక్టర్ డైవర్షన్ బోర్డులు పెట్టకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. మృతుడు వెంకటేశ్వరరావుకు ముగ్గురు కుమార్తెలు కాగా.. వారంతా అమెరికాలో స్థిరపడ్డారు.

క్లుప్తంగా

10న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యోగాసనా భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 10వ తేదీన ఏలూరు జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు వెంకటేష్ గురూజీ తెలిపారు. మంగళవారం స్థానిక గుప్త విద్య, దివ్యజ్ఞాన సమాజం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక తూర్పువీధి మాదేపల్లి రోడ్డులోని ప్రేమాలయంలో యోగాసన పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పోటీల్లో 10 నుంచి 55 ఏళ్ల వయసు గల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చునన్నారు. యోగాసన భారత్ అధ్యక్షుడు అలపాటి నాగేశ్వర రావు మాట్లాడుతూ పోటీదారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని, అలాగే పోటీలో పాల్గొనే ఒక్కో విభాగానికి రూ. 100 రుసుము చెల్లించాలన్నారు. వివరాలకు ఏలూరు జిల్లా యోగాసనా భారత్ కార్యదర్శి మోటమర్రి మల్లికార్జున రావు 98486 11744, కోశాధికారి సాంబశివరావు 94907 34033 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

3న అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బాపట్లలో రాష్ట్రస్థాయిలో అంతర జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయని ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఏలూరు జిల్లా బాలబాలికల జట్లను ఆగస్టు 3వ తేదీన ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి జట్టు ఎంపిక చేపడతామన్నారు. అండర్ 14,, 16, 18, 20 విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు పుట్టినతేదీ, ఆధార్, ఎస్‌ఎస్‌సీ మార్క్‌లిస్ట్‌తో హాజరై రూ.200 ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు 62814 31202 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డిప్లమో హార్టీకల్చర్‌లో చేరికకు నెలాఖరు వరకే అవకాశం

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో డిప్లమో హార్టీకల్చర్‌లో చేరడానికి ఈనెల 31వ తేదీ ఆఖరు అని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలో నాలుగు, వర్సిటీ గుర్తింపు పొందిన మూడు పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లమో హార్టీకల్చర్, ల్యాండ్‌స్కేపింగ్, నర్సరీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరడానికి మాన్యువల్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఇంతకు మునుపు నమోదు చేసుకున్న అభ్యర్థులతో పాటు , కొత్తగా నమోదు చేసుకున్న దరఖాస్తు దారులు ఈనెల 31వ తేదీ ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తుది విడత కౌన్సిలింగ్ వెంకట్రామన్నగూడెంలో జరుగుసుందన్నారు. విద్యార్థులు స్వయంగా తగిన ధ్రువపత్రాలతో వచ్చి కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలు, సీట్ల ఖాళీల సమాచారం కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



బస్సు మొరాయించడంతో మరో వాహనం కోసం ప్రయాణికుల పడిగాపులు

ఉండి: భీమవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై మహదేవపట్నం సత్రం వద్ద మంగళవారం మొరాయించింది. భీమవరం నుంచి గణపవరం మీదుగా తాడేపల్లి గూడెం వెళ్లే ఈ బస్సు బయలుదేరి సరిగ్గా ఐదు కిలోమీటర్లు కూడా ప్రయాణించకుండానే ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులో మహిళా ప్రయాణికులు, విద్యార్థులు ఉండడంతో గమ్యం చేరేందుకు వారు చాలా ఇబ్బందిపడ్డారు. బస్సులను పరిశీలించకుండానే డిపోనుంచి సర్వీసులకు అధికారులు పంపించేస్తున్నారంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కొబ్బరి ధరహాసం

- రికార్డు స్థాయిలో నీటి కొబ్బరి, కురిడీ ధరలు
- తమిళనాడు, కేరళలో పంట తగ్గడమే కారణం
- వరుస పండుగలతో పెరిగిన కొబ్బరి ధరలు
- కొబ్బరి వ్యాపారులు, రైతుల్లో హర్షం

పాలకొల్లు సెంట్రల్: గత రెండు నెలలుగా రికార్డు స్థాయిలో కొబ్బరి ధరలు పలుకుతుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పశ్చిమగోదావరి జిల్లాలో పచ్చి కొబ్బరి, కురిడి, కొత్త కొబ్బరి కాయ దొరకడమే గగనంగా మారింది. ప్రస్తుతం శ్రావణమాసం ప్రారంభం కావడంతో మార్కెట్లో కొబ్బరికి డిమాండ్ మరింత పెరగడంతో ఇక్కడ కూడా పంటకు కొరత ఏర్పడింది. ధర ఉన్నా సరుకు అందుబాటులో లేకపోవడంతో ధర మరింత పెరిగే అవకాశం ఉంటుందని రైతులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో దాదాపుగా 80 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుంది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఏలూరు, నిడదవోలు, జంగారెడ్డి గూడెం, రెడ్డిసీమ, కోరుమామిడి, చింతలపూడి, ద్వారకాతిరుమల, దేవరపల్లి, పెదవేగి, కొవ్వూరు, నల్లజర్ల, గోపాలపురం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, పాలకొల్లు, మొగల్తూరు, పేరుపాలెం వంటి ప్రాంతాల్లో కొబ్బరి పంట అధికంగా కొనసాగుతుంది.

జోరుగా కొబ్బరి మార్కెట్

శ్రావణమాసానికి ముందుగానే జిల్లాలో కొబ్బరి మార్కెట్ జోరందుకుంది. కురిడి కొబ్బరికైతే ధర రికార్డు స్థాయిలో ఉండడం గమనార్హం. ప్రస్తుతం మార్కెట్‌లో పాత కాయల్లో పెద్ద సైజు గిలక కాయలు వెయ్యి కాయల ధర రూ.24,500, చిన్న సైజు కాయలు రూ.20 వేలు వరకూ మార్కెట్ జరిగింది. అలాగే కొత్త రకం కాయల్లో పెద్ద (అరవై బత్తి) సైజు రూ. 22,500, చిన్న సైజు కాయలు రూ.18 వేలు వరకూ ఉంది. నెంబర్ కాయ (అతి చిన్న సైజు) కొబ్బరి రూ.15 నుంచి 18 వేలు పలుకుతుంది. కురుడీ కాయలో పెద్ద సైజు ధర రూ.30 వేల గటగట సైజు రూ.27 వేల వరకూ పలుకుతోంది.



కురిడీ కొబ్బరి గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు

పండుగల ప్రభావం

మన రాష్ట్రం నుంచి గుజరాత్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘఢ్, ఉత్తర ప్రదేశ్, డిల్లీ, పంజాబ్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఒరిస్సా, హర్యానా వంటి అనేక రాష్ట్రాలకు ఇక్కడ నుంచి ఎక్కువగా ఎగుమతులు అవుతుంటాయి. శ్రావణమాసంలో దాదాపుగా ఈ ఒక్క నెలలోనే శ్రావణ శుక్రవారాలు, మంగళవారాలు, శుక్ల ఏకాదశి, బహుళ ఏకాదశి, దూర్వాగణపతి హోమం, వరలక్ష్మీ వ్రతం, సంకట హర చతుర్థి, శ్రీకృష్ణాష్టమి, మాసశివరాత్రి రాఖీ పౌర్ణమి, పోలాల అమావాస్య, నాగ పంచమి, ఆగస్టు నెలలో వినాయకచవితి రావడంతో ఆయా రాష్ట్రాల్లో పండుగ వాతావరణం అంతా ఈ నెలలోనే ఉండడంతో కొబ్బరి మార్కెట్ నిలకడగా ఉండడానికి కూడా ఒక కారణంగా చెబుతున్నారు.



మహారాష్ట్ర, గుజరాత్ ఎగుమతయ్యే ఫోర్ పట్టా కొబ్బరి

కాయల్లో నాణ్యత ఉండాలి

రైతులు దింపు తీసేటప్పుడు నాణ్యమైన నిక్కర్చి కాయలను మాత్రమే దింపు తీయాలి. బరువైన కాయలు దింపు తీయడం వల్ల అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం లేక కాయలు కుళ్లిపోతుంటాయి. నిక్కర్చి కాయలు బరువు తక్కువ ఉండే బాగా తయారైన కాయలు దింపు తీయడం వల్ల మార్కెట్ ధర కూడా ఎక్కువగా ఉంటుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. దింపు తీసే కార్మికులు అందుబాటులో లేకపోవడంతో రైతులు కొంత ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరి విజ్ఞాన కేంద్రాలు ఉమ్మడి పశ్చిమలో పెదవేగిలో తూర్పు గోదావరిలో అంబాజీపేటలోనే ఉన్నాయి. కొబ్బరి పంటపై రైతుల్లో అవగాహన కల్పించేలా ప్రభుత్వం అవగాహనా సదస్సులు ఏర్పాటుచేయాలి.

అవగాహన అవసరం



ప్రస్తుతం మార్కెట్ ధర అత్యధికంగా ఉంది. రైతులు బాగా తయారైన కాయలను దింపు తీయించడం ద్వారా మంచి ధరను పొందవచ్చు. ప్రభుత్వం కోకోనట్ పరిశోధన కేంద్రాలను ఏర్పాటుచేసి మన ప్రాంతంలో కొబ్బరి రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.

– మైగాపుల రాంబాబు, కోకోనట్ సంఘ మాజీ అధ్యక్షుడు, పాలకొల్లు

ప్రభుత్వం శ్రద్ధ వహించాలి



ప్రస్తుతం ధరను బట్టి రైతుల్లోనూ కొబ్బరి పంటపై ఆసక్తి పెరుగుతుంది. ధరలు లేవని సరైన అవగాహన లేక కొందరు కొబ్బరి చెట్లను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వమే ప్రత్యేక శ్రద్ధ వహించి రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– కఠారి నాగేంద్రకుమార్, పాలకొల్లు కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పాలకొల్లు

తమిళనాడు, కేరళలో దిగుబడులు లేకపోవడమే

ప్రస్తుతం మార్కెట్లో కొబ్బరి ధరకు ఇంత జోష్ రావడానికి ప్రధాన కారణం తమిళనాడు, కేరళలో కొబ్బరి దిగుబడి తగ్గడమే. ఇటీవల వేసవిలో ఈ రెండు రాష్ట్రాల నుంచి కొబ్బరి బొండాల వ్యాపారం జోరుగా కొనసాగడంతో నేడు పంట దిగుబడి తగ్గి మన రాష్ట్రంలో కొబ్బరికి డిమాండ్ పెరిగింది. అందువల్ల గుజరాత్, ఉత్తర ప్రదేశ్, బీహార్, చత్తీస్‌ఘఢ్, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు మన ప్రాంతం నుంచే కొనుగోలు చేయాల్సి రావడంతో ధరలు ఆకాశాన్నంటాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సీజన్‌లో రోజుకు సుమారు 80 నుంచి 100 లారీల వరకూ ఎగుమతులు జరుగుతుంటాయి. అన్ సీజన్‌లో అయితే జిల్లాలో రోజుకు సుమారు 30 నుంచి 40 లారీల వరకూ ఎగుమతులు జరుగుతుంటాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం సీజన్ అయి ఉండి ధర కూడా అధికంగా ఉన్నా సరుకు లేకపోవడం వల్ల రోజుకు సుమారు 60 నుంచి 80 లారీలు వరకూ ఎగుమతులు అవుతున్నాయని అంటున్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

- ఇళ్ల దొంగతనాల్లో ఇద్దరు, బైక్ చోరీల్లో మరో ఇద్దరి అరెస్ట్
- రూ.11.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, 17 మోటార్‌సైకిళ్లు స్వాధీనం

ఏలూరు టౌన్: ఏలూరులో రాత్రివేళ ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న కేసులో ఇద్దరు నిందితులను, బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.11.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, 17 మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వివరాలు వెల్లడించారు. కైకలూరు మినీబైపాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ బృందం అదుపులోకి తీసుకుని విచారించగా పలు ఇంటి చోరీల్లో బంగారు ఆభరణాలు అపహరించినట్లు నిర్ధారించారు. వారివద్ద నుంచి రూ.11.50 లక్షల విలువైన హారం, చంద్రహారం, మురుగులు, ఉంగరాలు,



రికవరీ చేసిన బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్

చెవిమాటీలు, నవరత్నాల దిద్దులు, బేబీ రింగులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో నిందితులైన గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పిల్లి సురేష్ అలియాస్ శివ, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన నాగళ్ళ ముత్తయ్య గుప్తాలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరిపై చోరీ, కొట్లాట, మోసం కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును ఛేదించిన సీఐ సత్యనారాయణ, వన్‌టౌన్ ఎస్సై ఎస్‌కే మదీనా బాషా, ఎస్సై నాగబాబు, వన్‌టౌన్ ఏఎస్సై అహ్మద్, హెచ్‌సీ రమేష్, కానిస్టేబుళ్లు మోహన్, నాగార్జున, నాగరాజు, శేషుకుమార్, రుహుల్లా, సీసీఎస్ ఏఎస్సై గోపి, హెచ్‌సీ రమణ, పీసీ రజని ఉన్నారు. వీరిని ఎస్పీ అభినందించారు.

మోటార్‌సైకిళ్లు స్వాధీనం

ఏలూరు త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, భీమడోలు సీఐ యూజే విల్సన్ వారి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నిఘా, తనిఖీలు చేపట్టి భారీగా చోరీకి గురైన మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఎస్సై రాంబాబు, సిబ్బందితో నిఘా ఉంచి ఇద్దరు దొంగలను అరెస్ట్ చేశారు. వారిద్దరి నుంచీ 14 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకోగా, వాటి విలువ సుమారు రూ.6.68 లక్షలుగా ఉంటుందని అంచనా. ఇక భీమడోలు సీఐ విల్సన్ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ తమ సిబ్బందితో తనిఖీలు చేసి 3 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందని అంచనా. కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన సయ్యద్ రజాక్, సయ్యద్ కరీముల్లాను అదుపులోకి తీసుకుని విచారించగా మోటారు సైకిళ్ల చోరీ కేసులు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

జీఐపై ఉద్యాన వర్సిటీ ఎంఓయూ

తాడేపల్లిగూడెం: భౌగోళిక గుర్తింపు సూచికల ఆవశ్యకత నానాటికి పెరుగుతుందని, ఈ మొక్క మనదే, ఈ వస్తువు భారతదేశానిదే అనే విషయాలు అధికారికంగా గుర్తింపు పొందాలంటే జీఐ సూచికల ప్రాధాన్యత అవసరం ఉందని హైదరాబాద్‌కు చెందిన రిసల్యూట్ 4ఐపీ గ్రూపు వ్యవస్థాపకుడు సుభజిత్‌సాహా అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మంగళవారం జీఐ అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. 2030 నాటికి 10వేల జీఐల నమోదు చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జీఐలు పొందటంలో విశ్వవిద్యాలయాల పాత్ర పెరిగిందన్నారు. ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ జీఐలు పొందడంలో విశ్వవిద్యాలయాలకు ఆచరణలో ప్రతిబంధకాలు ఉన్నాయని, ఇలాంటి విషయాలపై ఆకళింపు కలిగిన రిసల్యూట్ గ్రూపు అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ సంస్థతో ఉద్యానవర్సిటీ ఎంఓయూ కుదుర్చుకుందన్నారు. దీని వల్ల యూనివర్సిటీ



జీఐపై ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న ఉద్యాన వర్సిటీ వీసీ తదితరులు

తయారు చేసిన వంగడాలు వంటి వాటికి జీఐ సులభతరంగా వచ్చే అవకాశం ఉందన్నారు. రీసల్యూట్ సంస్థతో ఒప్పంద పత్రాలను వీసీ గోపాల్, సుభజిత్ సాహ మార్చుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీయల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డాక్టర్ కె.ధనుంజయ్ రావు పర్యవేక్షించారు. విశ్వవిద్యాలయ అధికారులు ఎం .మాధవి, బి.శ్రీనివాసులు, బి.ప్రసన్నకుమార్, ఎస్.సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు

పంగిడిగూడెం వద్ద పోలవరం కుడి కాలువలో యువకుడి మృతదేహం లభ్యం

ద్వారకాతిరుమల: ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన యువకుడు పంగిడిగూడెం వద్ద పోలవరం కుడి కాలువలో శవమై కనిపించాడు. వివరాల్లోకి వెళితే. మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన పొద్దుటూరి శ్యామ్(21) గత రెండేళ్లుగా ద్వారకాతిరుమలలోని ఈకామ్ ఎక్స్‌ప్రెస్ కొరియర్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గత ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి నుంచి బైక్‌పై వెళ్లిన శ్యామ్ తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ఫలితం లేదు. దాంతో శ్యామ్ తల్లి సంకురమ్మ సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం పంగిడిగూడెం వద్ద పోలవరం కుడి కాలువలో మృతదేహం లభించగా అది శ్యామ్‌గా గుర్తించారు. భీమడోలు సీఐ యుజే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, సిబ్బంది శ్యామ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిస్సింగ్ కేసును అనుమానాస్పద మృతిగా మార్చుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. శ్యామ్ మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అతడికి తల్లి, ఒక అన్నయ్య ఉన్నారు.



కాలువలో లభ్యమైన మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ విల్సన్, ఎస్సై సుధీర్



పొద్దుటూరి శ్యామ్ (ఫైల్)

ఫసల్ బీమా.. రైతులకు ధీమా

చింతలపూడి, దెందులూరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే వరకు అన్నదాతలకు ఆందోళన తప్పడం లేదు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతన్నలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన రైతులకు ధీమానిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలతో పంటలకు నష్టం వాటిల్లితే కర్షకులకు ఇబ్బంది లేకుండా బీమా వర్తించేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు సహాయ సంచాలకులు వై సుబ్బారావు, దెందులూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు. బీమా ప్రీమియం చెల్లించేందుకు వరి పంటకు ఆగస్టు 15 వరకు సమయం ఉండగా మినుముల పంటకు మాత్రం ఈనెల 31 వరకు మాత్రమే గడువు ఉందని, రైతులు త్వరపడాలని సూచించారు.

రైతులకు కలిగే ప్రయోజనాలు

ఖరీఫ్‌లో ఆహార ధాన్యాలు, చిరు ధాన్యాలు, నూనె గింజలు పండించే రైతులు ఎకరానికి రూ.840 చెల్లించాలి. వరి పంటకు నష్టం సంభవిస్తే ఎకరానికి రూ.42 వేల వరకు బీమా పొందే అవకాశం ఉంటుంది. మినుముల పంటకు రూ.300 చెల్లించాల్సి ఉండగా రూ.20 వేల వరకు బీమా పొందవచ్చు. రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు కూడా బీమా కట్టుకోవచ్చు.



మెట్ట ప్రాంతంలో నాట్లు వేయడానికి ఖరీఫ్ దుక్కులు దున్నుకుంటున్న రైతు

బీమా వర్తింపు ఇలా..

ముంపు, చీడపీడలు, తుపాన్లు, అగ్ని ప్రమాదాలు, వడగళ్లు, పెను గాలుల ధాటికి పంట నష్టపోయినప్పుడు ఫసల్ బీమా వర్తిస్తుంది. అదేవిధంగా పంట కోసి పనలపై ఉన్నప్పుడు అకాల వర్షాలు, తుపాన్లు కారణంగా పంట దెబ్బతిన్న ఘటనల్లో కూడా బీమా వర్తింపచేశారు. ఒకవేళ తుపాన్లు, వరదలు సంభవించినప్పుడు పంట ముంపుకు గురైతే 48 గంటల్లోగా సంబంధిత బ్యాంక్ వారికి, బీమా కంపెనీకి, వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలి.

గ్రామం యూనిట్‌గా..

గ్రామంలో పండే ప్రధాన పంటను గ్రామం యూనిట్‌గా పరిగణిస్తారు. ఏలూరు జిల్లాలో వరి పంటను గ్రామం యూనిట్‌గా గుర్తించారు. పంట ముంపుకు గురైనప్పుడు, వడగళ్ల వానలకు దెబ్బ తిన్నప్పుడు బీమా వర్తిస్తుంది. 50 శాతానికి పైగా పంట దిగుబడి నష్టం జరిగితే నిబంధనల మేరకు నష్టాన్ని అంచనా వేసి 25 శాతం బీమా సొమ్మును వెంటనే చెల్లిస్తారు. రైతులు కూడా అధిక వర్షాలు, లేదా అనావృష్టి పరిస్థితులు సంభవించినప్పుడు 7 రోజుల్లోగా ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుంది. ఇదికాక వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కూడా అమల్లో ఉంది. రైతులు ఈ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు విజ్ఞప్తి చేశారు.

మానవ హక్కుల ఫోరం సభ్యుడిగా మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ (ఎన్‌హెచ్‌ఆర్‌పీ ఫోరం) ఎస్సీ, ఎస్టీ వింగ్‌కు జాతీయ సభ్యునిగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు నియమితులయ్యారు. సంస్థ జాతీయ చైర్మన్ జేఎస్ఆర్ నాయుడు ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగరాజు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా రెండు సార్లు పనిచేశారు. ఫోరం సభ్యునిగా నియమితులైన మంగరాజును మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతాల శరత్ బాబు, నాయకులు నల్లి రాజేష్, తిరగటి శివ, గంటా సుందర్ కుమార్ అభినందించారు.



మంగరాజు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి





కొమ్ము రవీంద్ర మృతదేహం, ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

టి.నరసాపురం: ఆయిల్‌పామ్ గెలలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. టి.నరసాపురంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము రవీంద్ర (22) ఆయిల్‌పామ్ గెలలు నరికే పని చేస్తుంటాడు. మంగళవారం మరో వ్యక్తితో కలిసి టి.నరసాపురంలో ఆయిల్‌పామ్ గెలలు నరికే పనికి వెళ్లాడు. గెలలు కోస్తుండగా గెలలు కోసే గెడకు విద్యుత్ షాక్ తగిలి రవీంద్ర కిందకు పడిపోయాడు. స్థానికులు రవీంద్రను చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని ధర్నా

చింతలపూడి ఏరియా హాస్పిటల్‌లో ఉన్న రవింద్ర మృతదేహాన్ని ఆయిల్‌పామ్ గెలలు నరికే కార్మికులు, సీఐటీయూ నాయకులు సందర్శించారు. అనంతరం ఫైర్ స్టేషన్ సెంటర్లో మృతుని కుటుంబీకులతో కలసి ధర్నా నిర్వహించారు. రవీంద్ర కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆందోళనకారులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

పెదతాడేపల్లి గురుకులం జాతికి అంకితం



పెదతాడేపల్లి గురుకుల పాఠశాలను జాతికి అంకితం చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం వీడియో సమావేశం ద్వారా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జాతికి అంకితం చేసినట్లు ప్రిన్సిపాల్ బి.రాజారావు తెలిపారు. ఆయనతో పాటు సహాయ మంత్రులు సుకాంత్ మజుందార్, జయంత్ చౌదరి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పీఎంశ్రీ పథకాన్ని భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలోని 26 పీఎంశ్రీలలో ఉత్తమ పాఠశాలగా పెదతాడేపల్లి గురుకులాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. డీఈవో నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్యామ్ సుందర్, ఏఎంవో సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ ఇందిర పాల్గొన్నారు.

క్లుప్తంగా

తణుకు మండల అధ్యక్షుడిగా వెంకటరామన్న


పెనుమర్తి వెంకటరామన్న

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తణుకు మండల అధ్యక్షుడిగా పెనుమర్తి వెంకట రామన్న (అబ్బులు)ను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తణుకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు ఆయనకు అభినందనలు తెలిపారు.

26 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు


తణుకులో ఉచిత వైద్య శిబిరంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం


తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 26 మందికి వైద్యసేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు రోగులకు వైద్యసేవలందించి, ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి విషయాలపై అవగాహన కల్పించారు. సుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి నిరుపేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాదు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నైతిక విలువలతో ఉండాలి


ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలను నేర్పించాల్సిన బాధ్యత గురువులతో పాటు తల్లిదండ్రులకు ఉందని అష్టావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి ఉల్లంపర్రులో నిర్వహించిన అష్టావదాన కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష చాలా గొప్పదని అలాంటి తెలుగు బాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, దాయన సురేష్ చంద్రజీ, అంగర మానస, చల్లా అన్నపూర్ణేశ్వరరావు, వీవీఎస్ఎన్ రాజు, పెన్మెత్స సత్యనారాయణరాజు, యర్రంశెట్టి వెంకటరత్నం పాల్గొన్నారు.

నడిపూడిలో నాగపంచమి వేడుకలు


నాగపంచమి వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు

పెనుగొండ: మండలంలోని నడిపూడి స్వయంభూ: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం నాగపంచమి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అర్చనలు, పంచామృతాభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక నవగ్రహ కల్ప పూర్వక లక్షపత్రి పూజ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. వేదపండితులతో కలిసి ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మ పూజలు అభిషేకాలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి ఆర్‌వీవీఎస్ రామ చంద్రకుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిళలపై దౌర్జన్యాలు పెరిగాయి

నరసాపురం: కూటమి సర్కార్ రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తోందని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. మద్యం మత్తులో మహిళలపై దౌర్జన్యాలు, బాలికలపై అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మీరా భవన్‌లో నిర్వహించిన ఐద్వా పట్టణ మహాసభలో ఆమె మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే మద్యాన్ని నియంత్రిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు వీధివీధినా బెల్ట్‌షాపులు పెట్టి, మహిళలకు రక్షణ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తానన్న పథకాలు అమలు చేయకపోవడంతో గ్రామాల్లో మహిళలు వడ్డీ వ్యాపారుల వద్ద, మైక్రోఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పులు చేస్తున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

అధ్వానంగా జగనన్న కాలనీలు

- కానరాని రోడ్లు, డ్రైయిన్లు
- కూటమి ఏడాదిన్నర పాలనలో జగనన్న కాలనీలో పరిష్కారం కాని సమస్యలు
- దుర్గంధం వెదజల్లుతున్న మురుగు గుంతలు


తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు కాలనీ రహదారి దుస్థితి

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించిన జగనన్న కాలనీలు అధ్వానంగా మారాయి. కనీసం శాశ్వత రహదారులు, డ్రైయిన్లు లేకపోవడంతో స్థానిక ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కేఎస్ఎన్ కాలనీ, కొండ్రుప్రోలు, ఆరుగొలను, మాధవరం, మెట్ట ఉప్పరగూడెం, వెంకట్రావుపాలెం, జగన్నాథపురం, ఎల్.అగ్రహారం తదితర గ్రామాల్లోని కాలనీలు వర్షం వస్తే మురికి కూపంలా మారుతున్నాయి. రోడ్లపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారడంతో పాటు ఈ బురదలోనే రాకపోకలు సాగించవలసి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీ పరిసరాల్లో పిచ్చిమొక్కలు ఉండటం విష సర్పాలు తిరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. డ్రైయినేజీ వ్యవస్థ సైతం సక్రమంగా లేకపోవడంతో ఎవరి ఇంటి వద్ద వారు గుంతలు తవ్వుకుని వాడకం నీటిని వాటిలోకి మళ్లిస్తున్నారు. గుంతల్లోని మురుగునీరు పొంగిపొర్లడంతో రోడ్లపైకి చేరి దోమలు చేరుతున్నాయని, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్న జగనన్న కాలనీల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా, ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కాలనీలో రోడ్లు, డ్రైయినేజీలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


మాధవరం జగనన్న కాలనీలోని మురుగు నీటిపై తేలియాడుతున్న దోమలు

వర్షాలొస్తే.. అవస్థలు



కాలనీలో సరైన రోడ్లు, డ్రైయిన్లులేవు. వర్షాలొస్తే నీరు పోయే మార్గం లేక రోడ్లపైనే తిష్ట వేస్తుంది. దీనికి తోడు డ్రైయిన్లు కూడా లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైకి చేరుతుంది. వర్షపు నీరు, మురుగు నీరు ఏకమై దుర్గంధం వెదజల్లుతుంది. కనీసం కచ్చా డ్రైయిన్లు ఏర్పాటు చేసి, మురుగునీరు పోయేలా చూడాలి. మున్సిపాల్టీ ద్వారా తాగు నీటిని అందించాలి.

– కొండపల్లి అంజి, కొండ్రుప్రోలు కాలనీ, తాడేపల్లిగూడెం మండలం

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి


మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసిన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుసు మోహన్ యాదవ్

తాడేపల్లిగూడెం అర్బన్ : వైఎస్సార్ సీపీని నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు అవిరళ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీల ఇన్‌చార్జ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుసు మోహన్ యాదవ్ తెలిపారు. మంగళవారం మాజీ మంత్రి కొట్టును కలిసిన ప్రత్యేక చర్చలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలన కారణంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో ప్రజలకు తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల అమలు చేయడంలో విఫలమైన విషయాన్ని పార్టీ నాయకులు సమష్టిగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇటీవల మూడు నెలల్లో రూ.37వేల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు ప్రజలకు ఏమి చేసాడో తెలియజేయాలన్నారు. అప్పులు చేయడంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నెం-1గా నిలిచిందని కాగ్ నివేదిక వెల్లడించిందన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లయన్స్ సేవలు నవతరానికి ఆదర్శం

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: సంఘపరంగా చేసే సేవలు నవతరానికి ఆదర్శంగా నిలుస్తాయని శాసనమండలి సభ్యులు, లయన్స్ పూర్వ గవర్నర్ వంక రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం పైడిపర్రు–తేతలి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తణుకులో లయన్స్‌క్లబ్స్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజ సేవ చేస్తున్నారని, ముఖ్యంగా పేద ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారని అన్నా రు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్, లయన్స్ జిల్లా సేవా కోఆర్డినేటర్ వంక రాజకుమారి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించి ప్రజల జీవితంలో మంచి ప్రభావం చూపించే విధంగా కృషి చేయాలని స్పష్టంచేశారు. నూతన కార్యవర్గం ప్రతిష్టాపనను పూర్వ గవర్నర్ గట్టి మాణిక్యాలరావు, నూతన సభ్యుల నియామకం లయన్స్ జిల్లా కోఆర్డినేటర్ వెల్లంకి స్వరూప్ చేశారు. నూతన అధ్యక్షుడిగా కంభాల రంగారావు ప్రమాణం చేసి గ్రామీణ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తానని వివరించారు. అల్లూరి గౌరిరావు, జోన్ చైర్మన్ మాదిరెడ్డి కృష్ణకుమార్, పూర్వ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీరావు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


అయితంపూడి గ్రామంలో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇరగరం: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని అయితంపూడి గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు నయవంచన చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్లు వేయించుకొని అవసరం తీరాక హామీలలను గాలికి వదిలేశారన్నారు. అధికారంలోకి రాగానే ఈ హామీలు ఎలా నెరవేర్చాలో అర్థం కావడం లేదు వీటికి డబ్బు ఎక్కడనుండి వస్తుందంటూ కొత్త రాగాలు పాడుతున్నారని విమర్శించారు. అంటే ఏదైనా చెప్పి ప్రజలను మోసగించి అధికారం సంపాదించాలన్న తపన తప్ప మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిలాగా చెప్పింది చెప్పినట్టుగా నెరవేర్చే నాయకులు కూటమి ప్రభుత్వంలోనే లేరని మండిపడ్డారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వడం లేదని, 50ఏళ్ల ఫించన్ ఇవ్వడం లేదని, జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దగా చేశారన్నారు.కూటమి ప్రభుత్వంపై ప్రజల పక్షన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పులూరి జితేంద్ర, పోతిరెడ్డి మాధవరావు, వెలగల వరాల రెడ్డి, రాయి బాబు రావు, దంపన బోయిన నాగేశ్వరరావు, రాయి నాగేశ్వరరావు,గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లూరులో పారిశుద్ధ్య కార్మికులపై లాఠీచార్జ్ అమానుషం



తణుకులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రతాప్, పారిశుద్ధ్య కార్మికులు

తణుకు అర్బన్: నెల్లూరు కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులపై కూటమి ప్రభుత్వం లాఠీ ఛార్జి, అక్రమ అరెస్టులు చేయడాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, మునిసిపల్ యూనియన్ కార్యదర్శి ఎస్.ఆదినారాయణ బాబు తీవ్రంగా ఖండించారు. మంగళవారం స్థానిక రాష్ట్ర పతి రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. గత 15రోజులుగా నెల్లూరులో పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలపై సమ్మె చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మునిసిపల్ కార్మికులకు ఉపయోగంగా ఉన్న ఆప్కాస్ రద్దు చేసి, అధికార కాంట్రాక్టర్లకు లాభాలు తెచ్చి, కార్మికులను రోడ్డున పడేసిందని విమర్శించారు. రాష్ట్రంలో మొదటి సారిగా నెల్లూరులో కాంట్రాక్టు విధానం తీసుకొని వచ్చి, పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందని మండిపడ్డారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులు ఈ విధానం వలన రోజు వారి కూలీలుగా మారిపోతున్నారని, మునిసిపల్ శాఖ మంత్రి ఉన్న చోటే కార్మికుల పట్ల పోలీసులు, అధికారులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. కూటమి ఎన్నికల ముందు పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నప్పుడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంట్రాక్టు విధానం ఉపసంహరించుకోవాలని లేకుంటే మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభిస్తామని అన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు పారిశుద్ధ్య కార్మికులపై లాఠీఛార్జిని ఖండించాలని, అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని, పాత కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గార రంగారావు, శృంగరుక్షం శ్రీను, కాకి రమణ, మీసాల సురేష్, అర్జి రాధాకృష్ణ, గంద్రాపు శ్రీను, బంగారు నూకరాజు, వెంకటేశ్వరావు, ఇ.సుధాకర్, టీ.ప్రసాద్, టీ.కృష్ణ బాబు, రాణి పాల్గొన్నారు.

బీవీఆర్ కళా కేంద్రాన్ని పరిరక్షించండి


అఖిలపక్ష సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎందరో మన్ననలు పొందిన తాడేపల్లిగూడెం బీవీఆర్ కళా కేంద్రాన్ని నిర్వీర్యం చేయడం తగదని, పరిరక్షించాలని పలువురు రాజకీయ నాయకులు, కళాకారులు విజ్ఞప్తి చేశారు. బీవీఆర్ కళాకేంద్రంను పరిరక్షణ చేయాలని మంగళవారం పట్టణంలోని కళాకేంద్రం వద్ద అఖిలపక్ష సమావేశం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు మాట్లాడుతూ 65 ఏళ్ల చరిత్ర కలిగిన ఆఫీసర్స్ క్లబ్ ఆనాటి జిల్లా కలెక్టర్ స్థలం మంజూరు చేయగా, నాటి తహసీల్దార్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్, బ్యాంకు మేనేజర్లు కార్యవర్గ సభ్యులుగాను, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, వైట్ ఛాంబర్ షిప్ సభ్యులుగాను దాతలు ఇచ్చిన చందాలతో భవనాన్ని నిర్మించారని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు కళాకేంద్రంలో సాంస్కృతిక, క్రీడలు, సేవా కార్యక్రమాలకు, నృత్యాలు, సంగీతం, సాహిత్యం, వర్క్‌షాపులకు, ఆరోగ్య శిబిరాలు, జాతీయ స్థాయి నాటికలు, నాటకాలు, పేద కళాకారులకు సేవలు ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ అధికారులు బీవీఆర్ కళా కేంద్రంను ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. కళా కేంద్రంను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కళా కేంద్రం పరిరక్షణకు అఖిలపక్ష సభ్యులు, పార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు. కేంద్రం కార్యదర్శి ఎన్‌వీ రమణరావు, పార్టీ నాయకులు చింతకాయల బాబూరావు, మార్నీడి బాబ్జి, మండల నాగేశ్వరరావు, త్యాగరాయ గాన సభ నిర్వాహకులు బాపయ్య శర్మ, అన్నమయ్య పద సుధ నిర్వాహకులు దాసరి కాశీ విశ్వనాధం, ఆత్మబంధువుల సేవా సంస్థ కార్యదర్శి కిరణ్, ఘంటసాల గాన సభ నిర్వాహకులు ఖాసిమ్, సాయి చిరు, బ్యాంక్ అసోసియేషన్ నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్, కళాకారులు చింతకాయల వంశీ, శారద, మాసా బాబురావు, నాగమణి, శరత్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి మురళీ, సాహితీ సమాఖ్య సభ్యులు పైలు శ్రీనివాసరావు, కామేష్, పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న మామిడి దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): సూపర్ సిక్స్ హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలు తప్పవని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మామిడి దాన వర ప్రసాద్ హెచ్చరించారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం బండి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. వర ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికుల ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అంటూ సుమారు 176 పథకాలకు హామీలు ఇచ్చిందని, ప్రజలకు చెప్పిన హామీలతో ఓట్లు వేయించుకుని, 14 నెలలు దాటుతున్న ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలేదన్నారు. పేద వర్గాలకు కార్పొరేషన్ రుణాలు ఇస్తామని చెప్పడంతో వివిధ వర్గాల ప్రజలు ఆన్‌లైన్ చేయించుకుని ఉన్నారని, కార్పొరేషన్ రుణాలు కోసం ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. చిన్న వ్యాపారం చేసుకుని బతుకుదాం అనుకున్నా నిరుద్యోగులకి నిరాశ మిగిల్చారని వాపోయారు. శ్రీనిధి పేరుతో మహిళలకు ఇస్తానన్న ప్రతి నెల రూ 1500 గాలికి వెళ్లి పోయిందన్నారు. నిరుద్యోగ భృతి, పేద వర్గాలకు 50 సంవత్సరాలకే పింఛన్, తదితర హామీలు ఏమి అమలు జరగ లేదని చెప్పారు. మరోప్రక్క నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశం అంటుతున్నాయని, పేద వర్గాలకు ఉపాధి లేక అనేక ఇబ్బందులతో పేద కుటుంబాలు సతమతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు చైర్మన్ ఉన్నారని, కార్మికుల సంక్షేమ విషయమై ఊసే లేదన్నారు. బోర్డు నుంచి పైసా విడుదల చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమితార చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, రాంబాబు, శ్రీనివాస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ట్రైతలాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలోని కె ఇల్లిందలపర్రు జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఈ నెల 25 నుంచి తేదీ వరకు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి మోడ్రన్ ట్రైతలాన్ పోటీల్లో కె ఇల్లిందలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నల్లి హ్యారీ,శీలబోయిన ధన్య శ్రీలు అత్యుత్తమ ప్రదర్శన చూపారని గుత్తుల కిషోర్ కుమార్ తెలిపారు. రన్నింగ్, షూటింగ్, స్విమ్మింగ్, మూడు అంశాలతో కూడిన ట్రై తలాన్ పోటీల్లో విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ విద్యార్థులకు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎ నాగమణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వీరవల్లి లీలా కుమారి, వ్యాయమ ఉపాధ్యాయులు సుబ్బారావు తదితరులు అభినందించారు.

సినారె జయంతి

తణుకు అర్బన్: సినీగేయ రచయిత సి.నారాయణ రెడ్డి (సినారె) జయంతిని సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. అక్షరాన్ని నడిపించడం ఆయనకు ఇష్టమని, సాహిత్యమంటే ప్రాణంగా సినారె నడిచేవారని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కర రావు అన్నారు. పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు సబ్జెక్ట్ ఉపాధ్యాయురాలు నంబూరి జానకిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు సినారె రచించిన గీతాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి


ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. గూడెం పట్టణంలో స్మార్ట్ మీటర్లును వ్యతిరేకించాలని మంగళవారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. సత్యవతి నగర్, మునిసిపల్ కాలనీ, కుంచనపల్లి ఏరియా తదితర ప్రాంతాలలో ప్రచార ర్యాలీ జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణలను, స్మార్ట్ మీటర్లును కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. కేంద్రం ఆదేశాలు మేరకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు రూపంలో పెను భారాలు వేస్తుందని, వేల కోట్లు రూపాయిలు సర్దుబాటు చార్జీలు అమలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, దీంతో విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయని మండిపడ్డారు. మీటర్లుకు అయ్యే ఖర్చులు సింగిల్ ఫేజ్‌కు రూ. 9 వేలు, థర్డ్ ఫేజ్‌కు రూ.17 వేలు ప్రజలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. స్మార్ట్ మీటర్లు బిగింపును ఆపకపోతే దశల వారీ ఆందోళన చేపడతామని, తగిని బుద్ధి చెబుతామని హెచ్చరించారు. శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, కన్నంరెడ్డి శివాజీ, ఎస్.సాయి, యడ్ల శ్రీను, కె.ఉదయ్ కుమార్, పతివాడ నాగేంద్రబాబు, కార్మిక నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి దాతలు సహకరించాలి


మునిసిపల్ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డును వెట్‌మిక్స్‌తో అభివృద్ధి చేసిన దృశ్యం

భీమవరం: సమస్యల పరిష్కారానికి దాతల స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు వెళ్లాలని భీమవరం పట్టణంలోని పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం కోడే వెంకట్రావు అన్నారు. చినరంగనిపాలెంలోని పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్ నుంచి పాలెం రోడ్డు వరకు వెట్ మిక్స్ రోడ్డును మాజీ కౌన్సిలర్ చెల్లబోయిన సుబ్బారావు నిర్మించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానికంగా ఉన్న చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఆధారపడకుండా దాతలు ముందుకు రావాలన్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి స్కూల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వెంకట్రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, మాజీ కౌన్సిలర్స్ చెల్లబోయిన సుబ్బారావు, బొక్కా చంద్రమోహన్, సీహెచ్ శాంతి రాజు, ఇళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉన్నతికి దాతలు సహకరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లల ఉన్నతికి ప్రతి ఒక్క దాత సహకరించాలని దాతలు సుధాకర్, సుధీర్ కుమార్, కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. భవిత సెంటర్‌లో మంగళవారం భవిత విద్యార్థులకు దాతలుచే వివిధ సేవా కార్యక్రమాలు చేశారు. ఉపాధ్యాయులు ప్రకాష్, సుశీల రాణి, భవిత కేంద్రం నిర్వాహకులు బాల ఈశ్వరయ్య, అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాల వద్ద ఏబీవీపీ ఆందోళన


హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కళాశాల ప్రధాన గేటువద్ద బైఠాయించిన నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఏబీవీపీ పట్టణ కార్యదర్శి రత్నాల జగదీష్ మాట్లాడుతూ డీఎన్నార్ కళాశాల హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు కనీసం పరిశుభ్రమైన తాగు నీరు కూడా అందించడం లేదంటూ హాస్టల్ నిర్వహణ ఏ విధంగా ఉందో అవగతమవుతుందన్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించి డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులు తాగునీరు, ఇతర అవసరాలకు వాడుకునే నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని కనీసం భోజనం తయారీకి వినియోగించే నిత్యావసర సరుకులు నాణ్యత లేవని ఆరోపించారు. అన్నంలో సున్నం కలుపడం వల్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని వాపోయారు. హాస్టల్స్‌లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కళాశాల యాజమాన్యాన్ని జగదీష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ సహ కార్యదర్శి సాయికృష్ణ, రోహిత్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

15న దివ్యాంగులకు పాటల పోటీలు

నరసాపురం: స్థానిక మదర్‌థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 15న దివ్యాంగుల రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు సంఘ ప్రతినిధి రాబర్ట్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వలందర్ రేవులో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే పోటీల్లో అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చిని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ 2 వేలు అందిస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొనేవారు రూ.200 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, ఇతర వివరాలకు 98480 26302 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

ప్రియుడిపై ప్రియురాలి ఫిర్యాదు

యలమంచిలి: ప్రేమిస్తున్నాని చెప్పి తన వాంఛ తీర్చుకుని ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని ప్రియుడిపై ప్రియురాలు మంగళవారం ఫిర్యా దు చేసింది. వివరాలప్రకారం కట్టుపాలెం గ్రామానికి చెందిన ఓ యువతి అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన చింతా సాయి దుర్గాప్రసాద్ (20) మోసం చేశాడని పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.